నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# వికారాబాద్

సోమవారం 23 అక్టోబర్ 2023
MONDAY, OCTOBER 23, 2023
VIKARABAD
పేజీలు : 12
PAGES



హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ కమాల్‌రెడ్డి

# అన్నదాతకు.. మరింత సాయం

మ్యానిఫెస్టోలో రూ.16వేలకు రైతుబంధు సాయం పెంపు



- అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు
- రైతన్నకు పెట్టుబడి చింతలేకుండా చేయూత
- ప్రస్తుతం ఎకరాకు ఏడాదికి రూ.10 వేల సాయం
- ఇప్పటివరకు జిల్లాకు రూ.2,926 కోట్ల సాయం
- జిల్లాలో మూడింతలు పెరిగిన సాగు విస్తీర్ణం
- బీఆర్‌ఎస్ మ్యానిఫెస్టోపై సర్వత్రా హర్షం

ఆరుగాలం కష్టపడే అన్నదాత కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తున్నది. గతంలో సాగు పనుల ప్రారంభం నుంచి పంట చేతికొచ్చేదాక పెట్టుబడులు తడిసిమోపెడవుతూ అన్నదాత అప్పుల సుడిగుండంలో చిక్కుకుని ఆగమయ్యేవాడు. రైతుల కష్టాన్ని గుర్తెరిగిన సీఎం కేసీఆర్ చేయూతనందించి గట్టెక్కించాలన్న సదుద్దేశంతో ప్రస్తుతం రైతుబంధు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తూ ఎకరాకు రూ.10 వేల సాయాన్ని అందజేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో రూ.2,926 కోట్ల రైతుబంధు సాయాన్ని అందజేసింది. దీనికితోడు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు తదితర వాటిని ప్రభుత్వం ఇస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నది. రైతు ఏ కారణంతోనైనా మృతి చెందినా ఆ కుటుంబానికి భరోసానిచ్చేలా రైతుబీమా పథకాన్ని అమలు చేస్తున్నది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రైతన్నకు మరింత చేయూతనందించాలని రైతుబంధు సాయాన్ని రూ.16వేల పెంచుతూ మ్యానిఫెస్టోలో చేర్చింది. అన్నివిధాలుగా ఆర్థిక సాయానికి తోడుగా సాగునీటి కోసం ప్రాజెక్టులు, చెక్‌డ్యాంల నిర్మాణం, 'మిషన్ కాకతీయ' చెరువులు, కుంటల పునరుద్ధరణతో నీటి నిల్వలు పెరిగి జిల్లాలో సాగు విస్తీర్ణమూ పెరిగింది. వ్యవసాయానికి ప్రాధాన్యతనిస్తూ రూపొందించిన మ్యానిఫెస్టోపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది.

– వికారాబాద్, అక్టోబర్ 22 (నమస్తే తెలంగాణ)

మన కోసం మ్యానిఫెస్టో

8



# కాంగ్రెస్‌తో నరకం.. బీఆర్‌ఎస్‌తో సంతోషం

సంక్షేమం పట్టని కాంగ్రెస్.. సంక్షేమమే బీఆర్‌ఎస్ ధ్యేయం

కర్ణాటకలో చిమ్మ చీకటి.. తెలంగాణలో వెలుగుజిలుగులు

అక్కడ పడావు భూములు.. ఇక్కడ పచ్చని పైరు

తాండూరు నియోజకవర్గం సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక ప్రజల గోస

బీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలంటున్న కర్ణాటకవాసులు

సెంటర్ స్ప్రెడ్‌లో..

తెలంగాణకు ఆనుకుని ఉన్న కర్ణాటకలో అక్కడి ప్రజలు నరకం అనుభవిస్తున్నారు. అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక పథకాలను అమలు చేస్తున్నది. తెలంగాణలో నిరంతర విద్యుత్తు సరఫరా ఉండగా, కర్ణాటకలో అరకొర కరెంట్‌తో జనం అవస్థలు పడుతున్నారు. కరెంట్ కొరత, సాగు నీరు లేక అక్కడ భూములు పడావు పడ్డాయని కర్ణాటక రైతులు గగ్గోలు పెడుతున్నారు. తెలంగాణలో పుష్కలంగా సాగు నీరు ఉండడం, నిరంతర కరెంటుతో సాగు సంబురంగా సాగుతున్నది. అన్నదాతలకు అధిక ప్రాధాన్యతనిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించుకోవాలని కర్ణాటక వాసులు సరిహద్దు తెలంగాణ ప్రజలకు తెలుపుతుండడం గమనార్హం.

– తాండూరు, అక్టోబర్ 22



తెలంగాణ–కర్ణాటక బషీరాబాద్ సమీపంలో కర్ణాటకలోకి ప్రవహిస్తున్న తాండూరు కాగ్నానది నీరు



ఉమ్మడి జిల్లాలో ఆదివారం సద్దుల బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. మహిళలు గౌరమ్మకు పూజలు చేసి గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మలను ఉంచి 'చిత్తూ చిత్తూల బొమ్మ... శివుని ముద్దూల గుమ్మ', 'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మ... ఏమేమి కాయొప్పునే గౌరమ్మా... అంటూ ఆడిపాడారు. రంగురంగుల పూలతో చేసిన బతుకమ్మలు చూపరులను ఆకట్టుకున్నాయి. చిన్నారులు పటాకులు కాల్చుతూ సందడి చేశారు. అనంతరం బతుకమ్మలను గ్రామాల సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేసి, ఒకరికొకరు వాయినాలను ఇచ్చిపుచ్చుకున్నారు.

లోపలి పేజీల్లో..



# పూల జాతర

అంగరంగ వైభవంగా సద్దుల బతుకమ్మ